

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళనలు

ప్రజాశక్తి - కడప : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 12న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం కడప జిల్లా కార్యాలయంలో 'వైసిపి ప్రజాఉద్యమం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 24న పార్టీ కార్యాలయానికి కోటి సంతకాలు చేయించనున్నట్లు తెలిపారు. గవర్నర్‌కు కలిసి కోటి సంతకాల ప్రతులను మాజీ సిఎం వై.ఎస్. జగన్ సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. 18 నెలల కూటమిపాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని రంగాలను అమ్మకానికి పెట్టారని అన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ రద్దు చేసే వరకూ పోరాటం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, పులి సునీల్ కుమార్, కార్పొరేట్ షఫీ, ఇలియాస్, కిషోర్, వినోద్, దాసరి శివ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'ఉల్లి' ధరలు ధమాల్

- కొనే వారు కరువు
- పొలాల్లోనే వదిలేసిన వైనం
- రైతులను ఆదుకోని ప్రభుత్వం





ఉల్లి పంటను పొలానికే వదిలేసిన రైతులు

ప్రజాశక్తి - చాపాడు

ఉల్లి సాగు చేసిన రైతుల కన్నీటి గాథలు వినేందుకు కూడా కష్టతరంగా ఉంది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటను పొలంలో వదిలేయలేక.. కొనుగోలుదారులు ముందుకు రాక దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనికితోడు వర్షాలతో పంట చేతికి అందక కొందరు కుదేలయ్యారు. పెట్టుబడులు మట్టి పాలై దిగాలు చెందుతున్నారు. క్వింటా రూ.1,200తో కొనుగోలు చేస్తామని అధికార యంత్రాంగం ప్రకటించినా ఆచరణకు నోచలేదు. మైదుకూరు, కమలాపురంలో కొనుగోలు కేంద్రాలంటూ ఊరించినా ఏర్పాటు కాలేదు. గతేడాది ఒక మోస్తారు ధర దక్కడంతో ఉల్లిపై రైతులు ఆశలు పెంచుకున్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచారు. పంట చేతికందే సమయంలో అధిక వర్షాలు దెబ్బ తీశాయి. ధర లేదని పంటను పొలంలో వదిలేయక కూలీలతో కోయిస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారు. పరిమాణం తక్కువని, కుళ్ళిన శాతం ఎక్కువ అనే సాకులతో ధర దిగ జార్చి కొంటున్నారు. నిల్వ ఉంచుకునే సౌకర్యం లేక పోవడంతో రైతులు ఏమి చేయలేని పరిస్థితి. గత ఏడాది 14 వేల ఎకరాలు సాగు కాగా, ఈ ఏడాది 19వేల ఎకరాలలో సాగు అంది. మైదుకూరు, దువ్వూరు, పెండ్లిమర్రి, చాపాడు, పోరుమామిళ్ళ, దువ్వూరు మండలాలలో సాగు చేశారు.. దువ్వూరు మండలంలో అధికంగా నాగాయపల్లి, చల్లబసాయిపల్లి, బాలాయపల్లి, మదిరేపల్లి, గుడిపాడు, రామాపురం, మైదుకూరు మండలంలో శ్రీనగరం, కేశలింగాయపల్లి, బండివారిపల్లి, క్రిష్ణాపురం, తిమ్మాయపల్లె, చిన్నయ్య గారి పల్లి, వనిపెంట గ్రామాల పరిధిలో ఉల్లిపంటను రైతులు సాగు చేశారు. గతేడాది క్వింటా రూ.2,500 కాగా ప్రస్తుతం అందుకు భిన్నంగా రూ.500 కూడా పలకడం లేదు. జిల్లాలోని ఉల్లి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పిస్తుందని అనుకుంటే దీనిపై నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. కర్నూలు జిల్లాలో మాత్రం ఇప్పటికే రైతులకు హెక్టార్ రూ. 50 వేలు చొప్పున అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. మన జిల్లాలో కూడా ఇదే విధంగా రైతులకు అందేలా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనలు వెలువడ లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి ఏర్పడుతుంది.

రెండు ఎకరాలలో సాగు చేశాను

ఖరీఫ్ సీజన్‌లో రెండు ఎకరాలలో ఉల్లి పంటను సాగు చేశాను. ఎకరా రూ.20 వేలకు కౌలుకు తీసుకొని సాగు చేశాను. ప్రస్తుతం నూర్పిడి చేసే సమయానికి వర్షం అధికంగా పడటం, దీనికి తోడు ధరలు లేకపోవడంతో పంటను వదిలేయాల్సిన పరిస్థితి. వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. చేతికి అంది వచ్చిన పంట ధరలు లేక పోవడంతో దిక్కుతోచడం లేదు. ఎకరా సాగుకు రూ.80 వేలకు పైగా ఖర్చులు అయ్యాయి.

- రామసుబ్బారెడ్డి, ఉల్లి రైతు, చల్లబసాయపల్లె, దువ్వూరు మండలం.

ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలి

ప్రస్తుతం నూర్పిడి చేసిన ఉల్లి పంటను స్థానికంగా వ్యాపారులు ఎవరూ కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు సాగు చేసిన ఉల్లి పంటను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలి. ఉల్లి పంట సాగుకు రూ. 75 వేలకు పైగా ఖర్చులు అయ్యాయి. ప్రస్తుతం వరుస తుపాన్ తాకిడికి తడుస్తూ పంట పూర్తిగా దెబ్బతింటున్నది.

- సుభాన్, ఉల్లి రైతు, సిద్దారెడ్డిపల్లె.

సీలింగ్ భూమి కబ్జా!

- విలువ రూ.10 కోట్లు
- పట్టని రెవెన్యూ అధికారులు



జెసిబితో భూమిని చదును చేయిస్తున్న కబ్జాదారులు

ప్రజాశక్తి- కాశినాయన

మండల పరిధిలోని రెడ్డి కొట్టాల గ్రామం, సర్వే నెంబర్ 2118లో 11.61 ఎకరాల సీలింగ్ భూమి ఉంది. ఆ భూమిని కొందరు యానాదుల పేర్లు చెప్పి రెండవ శనివారం ప్రభుత్వ కార్యాలయాలు సెలవు కావడంతో కబ్జా చేశారు. పైగా జెసిబితో చదును చేశారు. ఇదంతా రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టీ పట్టనట్లుగా వ్యవహించారు. సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్లు విలువ చేసే సీలింగ్ భూమిని కబ్జా చేస్తుండడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది. అసలు సీలింగ్ భూమా లేక రెడ్డిగారి భూమా, లేక యానాదులకు కేటాయించిన భూమా అని అధికారులు ఎటూ తేల్చలేక పోతున్నారు. దీనిపై వారు సరైన సమాధానం కూడా చెప్పడం లేదు. సంఘటనా స్థలానికి విఆర్ఓ నాయక్ వెళ్లినా జెసిబితో చేస్తున్న చదును పనులను అడ్డుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చదును చేస్తున్న కొందరని విఆర్ఓ ప్రశ్నించగా యానాదుల కోసమే తాము చదును చేస్తున్నామని సమాధానం ఇవ్వడం ఆశ్చర్యాన్ని గురిచేసింది. ఆన్‌లైన్ రికార్డులు పరిశీలిస్తే నాగిరెడ్డి కృష్ణవేనమ్మ పేరుపైన ఐదు ఎకరాల 95 సెంట్లు, నాగిరెడ్డి విజయసింహారెడ్డి పేరుపైన మూడు ఎకరాల 51 సెంటు, రోహిత్ రెడ్డి పైన ఎకరా 70 సెంట్లు చూపిస్తోంది. వాస్తవానికి 1983 సంవత్సరంలో పది మంది యానాదులకు ఒకొక్కరికి 85 సెంట్ల చొప్పున ప్రభుత్వంపట్టాలిచ్చింది. కానీ ఆ పట్టాలు అప్పట్లో టిడిపి నాయకుడు రమణారెడ్డి వద్ద ఉన్నట్లు సమాచారం. ఇంత వరకు యానాదులు ఆభూమి ఉపయోగించుకోలేదు. ప్రస్తుతం ఆ భూమికి రేటు పలుకుతుండడంతో రమణారెడ్డి కుమారుడు రోహిత్‌రెడ్డి మండలంలోని కొంతమంది టిడిపి నాయకులను పిలిపించుకుని జెసిబిలతో భూమిని చదును చేశారు. అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లుగా వ్యవహరించడం శోచనీయం. దీనిపై తహశీల్దార్‌ను అడిగేందుకు యత్నించగా ఆయన అందుబాటులో లేరు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంటనే భూ ఖబ్జాపై విచారణ జరిపించి ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోవాలని, యానాదుల భూమి అయితే వారికే ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. అలాగే ఆన్‌లైన్‌లో వేరొకరి పేర్లపై ఎలా నమోదయ్యాయో కూడా విచారించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భూ కబ్జాలు అధికమయ్యాయి

మండలంలో రోజురోజుకూ భూ కబ్జాలు అధికమయ్యాయి. రెడ్డికొట్టాల గ్రామంలో 2118 సర్వే నెంబరులో ల్యాండ్ సీలింగ్ కింద యానాదులకు పట్టాలు ఇచ్చారు. కొందరు అగ్రకులస్థులు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇప్పుడు అధికార పార్టీ నాయకులు ఆగమేఘాల పైన కబ్జా చేసేందుకు ఐదారు జెసిబిలతో యథేచ్ఛగా చదును చేస్తుంటే రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం దారుణం. జిల్లా అధికారులు వెంటనే భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి.

- ఎంబడి పోలయ్య, సిపిఎం మండల కార్యదర్శి, కాశినాయన.

యానాదులకు ఇస్తామని చెబుతున్నారు

భూమి ఆన్‌లైన్‌లో వేరొకరి పేర్లపై ఉంది. 1983లో భూమిని యానాదులకు అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది వాస్తవమే. రోహిత్ రెడ్డి అనే టిడిపి నాయకుడు యానాదులకే పట్టాలు ఇస్తామని చెబుతున్నారు.

- నాయక్, విఆర్ఓ, రెడ్డికొట్టాలు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

- మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 198 ఆలౌట్

ప్రజాశక్తి - కడప

అండర్ –14 డే మెన్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 198 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ప్రశాంత 41, తాహిర్ 39 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని రోహిత్ రెడ్డి 3, విక్రాంత్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 28.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 54 పరుగులు చేసింది. కడప జట్టులోని ముని జ్ఞానేశ్వర్ 2 వికెట్లు తీసుకున్నాడు. **ఉత్కంఠగా చిత్తూరు, కర్నూల్ మ్యాచ్..** కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 28.3 ఓవర్లలో 63 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని లిఖిత్ ఇరగంరెడ్డి 36 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని హేమంత్ నాలుగు, యశ్వంత్ సూర్య తేజ మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 34.3 ఓవర్లలో 56 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మోక్షజ్ఞరెడ్డి 26 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని రక్షణ సాయి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఆరు వికెట్లు తీసుకున్నాడు. తరుణ్ కుమార్ మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 26.0 ఓవర్లలో రెండు వికెట్లు నష్టానికి 78 పరుగులు చేసింది.



తలపడుతున్న కడప, అనంతపురం జట్లు

అప్పుల్లో ఆల్‌టైమ్ రికార్డు : పిసిసి

ప్రజాశక్తి - కడప : 17 నెలల కాలంలోనే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రూ. 2 లక్షల 27 వేల కోట్ల రూపాయల అప్పు చేసి ఆల్ టైం రికార్డు సృష్టించిందని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం డిసిసి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కంటే ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం అంతకుమించి అప్పు చేస్తోందని పేర్కొన్నారు. మన కంటే ఇతర రాష్ట్రాలు తక్కువ మొత్తంలో అప్పులు చేశాయన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణం పేరుతో రాష్ట్ర ప్రజలపై చంద్రబాబు ప్రభుత్వం అప్పుల భారం మోపడం శోచనీయం అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ట్రబుల్ ఇంజన్ సర్కార్‌గా మారిపోవడం దురదృష్టకరం అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి మరో శ్రీలంక చేయవద్దని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ సంఘ సేవకుడు సలావుద్దీన్, బిసిసెల్ జిల్లా అధ్యక్షుడు కులాయప్ప, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మైనుద్దీన్ , విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి ,విద్యార్థి విభాగం జిల్లా మాజీ అధ్యక్షులు మామిళ్ళ బాబు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ రవుఫ్,రఫీక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను తొలగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న ఉక్కాయపల్లె చెత్త స్టాక్ పాయింట్‌ను ఊరి మధ్యలో నుంచి వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ డిమాండ్ చేశారు. శనివారం ఆ ప్రాంతాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, డివిజన్ ఇంచార్జ్ యూసుఫ్ తోపాటు కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పరిశీలించారు. ఈ సందర్భంగా గౌస్‌పీర్ మాట్లాడుతూ గతంలో కడప నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తా, చెదారాలు, వ్యర్థాలు తీసుకొచ్చి ఈ ప్రాంతంలో డంప్ చేసేవారని తెలిపారు. ఈ కారణంగా ఎదురయ్యే సమస్యలపై పోరాటాలు చేస్తే ఇక్కడ చెత్త నిల్వ చేయకుండా డంపింగ్‌యార్డును నగర శివార్లలోకి తరలించారని చెప్పారు. ప్రస్తుతం కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్త చెతాదారాలను రీసైక్లింగ్ ఇక్కడ చేస్తూ ఉన్నారని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి చెత్త తరలించని కారణంగా చెత్తచెదారాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. ఈ విషయంగా పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, కార్పొరేషన్ అధికారులు ఈ యార్డ్‌ను ఊరి మధ్య నుంచి తొలగించి ఊరి బయటకు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కడప సిటీ ప్రెసిడెంట్ మైనార్టీ సెల్ ముబారక్, స్థానిక డివిజన్ ఇంచార్జ్ యూసఫ్, ఇతర ఇన్‌ఛార్జులు అంజన్ కుమార్, జాబీర్ అలీ, సిద్ధిక్, స్థానికులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డ్‌ను చూపుతున్న సయ్యద్ గౌస్‌పీర్

అస్తిత్వ ఉద్యమవీరుడు 'పప్పూరు రామాచార్యులు'

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమ కంఠస్వరంగా 'శ్రీసాధన' పత్రికను తీర్చిదిద్ది ప్రజల స్థితిగతులను, ఆకాంక్షలను, హక్కులను పత్రిక ద్వారా వినిపించిన అస్తిత్వ ఉద్యమవీరుడు పప్పూరు రామాచార్యులు అని సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయోద్యమకారుడు, పత్రికా సంపాదకుడు పప్పూరు రామాచార్యులు 130వ జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పప్పూరు రామాచార్యులు స్వాతంత్ర్యోద్యమం, గ్రంథాలయోద్యమంతోపాటు పత్రికారంగంలోను విశేషకృషి చేసిన ప్రతిభాశాలి అన్నారు. 'పినాకిని', 'శ్రీసాధన' లాంటి పత్రికలను నడిపి స్వాతంత్రోద్యమాన్ని మరింత పరిపుష్టం చేశారన్నారు. అనంతరం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ సహా యకులు ఎన్.రమేశ్‌రావు, మరో గ్రంథాలయ సహాయకులు జి.హరి భూషణ రావు ప్రసంగించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన చరిత్రను అధ్యయనం చేయాలి

- ఇంటాక్ రాష్ట్ర కన్వీనర్ లక్ష్మినారాయణ

ప్రజాశక్తి - కడప అర్బన్

మన ప్రాచీన చరిత్రను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ ఇంటాక్ రాష్ట్ర కన్వీనర్ యస్వీ.యస్.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో క్షేత్ర సందర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని లక్ష్మీనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులు చరిత్రను తెలుసుకోవడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ సంపద ప్రాశస్త్యాన్ని తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించేందుకు ఇంటాక్ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందన్నారు. ఉమ్మడి వైయస్సార్ జిల్లాలోని పుష్పగిరి, ఒంటిమిట్ట, నందలూరు ఆలయాలను సభ్యులు, జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసులు, గునిశెట్టి సాయికుమార్, టి. ఎస్.గౌరిశంకర్, వలకల గౌరీ శంకర్, అనంతబోట్ల వెంకటసుబ్బయ్య, వెల్లాల వెంకటేశ్వరాచారి, ఆదూరి శివశంకర్ రెడ్డి, దేవతి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.



జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న ఇంటాక్ సభ్యులు

విధులకు ఎగనామం పెట్టిన

టీచర్లపై చర్యలు తీసుకోవాలి

- డిఇఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రభుత్వ పాఠశాలలకు పని దినమైన శనివారం మైదుకూరు మండల పరిధిలోని నంద్యాలంపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు విధులకు ఎగనామం పెట్టి, విహారయాత్రలో మునిగితేలు తుండడం దుర్మార్గమని, వీరిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. శనివారం డిఇఒ కార్యాలయంలో డిఇఒ షంషుద్దీన్ కి వినతి పత్రం అందజేశారు. విధులకు ఎగనామం పెట్టి విహార యాత్రలో విహరిస్తున్న ఉపాధ్యాయులు పనిచేస్తున్న పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఇటీవల మొంథా తుఫాను ప్రభావంతో విద్యాశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా పాఠశాలకు మూడు రోజులు సెలవులు ప్రకటించారని పేర్కొన్నారు. వాటి స్థానంలో రెండవ శనివారాన్ని పని దినంగా పేర్కొంటూ జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. విద్యాశాఖ అధికారి ఆదేశాలను బేఖాతారు చేస్తూ మైదుకూరు మండలం, నంద్యాలపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పది పాఠశాలలు చెందిన ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా సెలవులు పెట్టి రెండు రోజులపాటు విహారయాత్రకు బయలుదేరారన్నారు. వీరి స్థానంలో మండల పరిధిలోని కొంతమందిని డిప్యూటేషన్ పై విధులు కేటా యించారన్నారు. మైదుకూరు ఎంఇఒ పద్మలత నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ సంఘటనపై, ఆర్‌జెడి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. తక్షణమే అధికారులు సంఘటనపై విచారణ చేపట్టి ఉపాధ్యా యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కడప నగర అధ్యక్షులు జాల సుమంత్, నగర కార్యదర్శి అఖిలేష్, పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి - బద్వేల్ : డ్రగ్స్, గంజాయి రహిత సమాజం కోసం అందరం కలిసికట్టుగా నడుం బిగిద్దామని బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప పేర్కొన్నారు. శనివారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ముద్రించిన పోస్టర్స్ బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో అర్బన్ సిఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బద్వేల్ అర్బన్ సిఐ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో తెలిసీ తెలియని వయసులో యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, ఇ అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘం నాయకత్వానికి అభినందనలు తెలిపారు. ముఖ్యంగా డ్రగ్స్ గంజాయి వంటి వాటికి బానిసవుతున్నారని, తద్వారా తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. గంజాయి వాడినా, అమ్మినా నేరమని, కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా మంచి మార్గంలో నడిచి తమ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దామని వారు పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు కాదు యువతకు చైతన్యపరిచే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, ఎస్.కె.ఆదిల్, ఉపాధ్యక్షులు ఎస్.కె.ఖలీల్ బాషా, డివైఎఫ్ఐ మహిళా కో– కన్వీనర్ ఎస్కే ఫాతిమాపాల్గొన్నారు.

రేడియాలజీ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కడప సిటీ

ప్రభుత్వ సర్వ జన హాస్పిటల్ రేడియా లజీ విభాగంలో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి సూప రింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సుశీల, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా రేడియాలజీ ఆవిష్కర్త సర్ విల్హెల్మ్ రాంట్జెన్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎక్స్‌రేలు ఎలా కనుగొనబడ్డాయి, రేడియాలజీ రంగం అభివృద్ధి ఎలా సాగింది అనే అంశాలపై పవర్ పాయింట్ ద్వారా వివరి ంచారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ శారద, అసోసి యేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్ర నాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డేవిడ్, విద్యార్థులు, రేడియోగ్రాఫర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిమ్స్ సిబ్బంది

ఆదర్శమూర్తి భక్త కనకదాస : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్ : తత్వవేత్త, కవి, సంగీత కారుడు, స్వరకర్త అయిన 'భక్త కనక దాస' సమాజాన్నే మెప్పించిన ఆదర్శ మూర్తి అని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ భక్త కనకదాస జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ తత్వవేత్త, కవి, సంగీతకారుడు, స్వరకర్త అయిన కనక దాసు కర్ణాటక సంగీతం కోసం ఎనలేని సేవ చేశారన్నారు. కర్ణాటకలో జన్మించిన ఆయన మంచి విద్యావంతులుగా సమాజాన్ని అన్నికోణాల్లో సూక్ష్మ పరిశీలన చేశారన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కనకదాస చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారులు, బిసి కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ఎస్పి కార్యాలయంలో..** సామాజిక సంస్కర్త, గొప్ప కవి శ్రీభక్త కనకదాస జయంతి వేడుకలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఎఎస్పి బి.రమణయ్య హాజరయ్యారు. భక్త కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐలు శివరాముడు, టైటస్, సోమశేఖర్ నాయక్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, చూడామణివర్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జల్లిపాటి రవికి డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్ : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆంగ్ల విభాగ పరిశోధక విద్యార్థి జల్లిపాటి రవికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదాన చేసింది. 'ద ఊవ్ రా ఆఫ్ రాజారావు, యాన్ ఓవర్ వ్యూ' అనే అంశంపై ఇంగ్లీష్ హెడ్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ జి.ఎం.సుందరవిల్లి మార్గదర్శకంలో పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అధ్యాపకులు అభినందించారు.

కబ్జాకోరులు

ప్రజాదృష్టి

భూకబ్జాకోరుల ఆగడాలు మితిమీరుతున్నాయి. జిల్లాలోని కడప, బద్వేల్, బ్రహ్మంగారిమఠం మండలాలు భూకబ్జాలకు నిలయంగా మారిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఎక్కడైనా సరే చిన్న జాగా కనిపిస్తే చాలు అధికార పార్టీ నాయకులకు పాగా వేయడం అలవాటుగా మారింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎవరు అధికారంలో ఉన్నా భూకబ్జాల పర్వం యథేచ్ఛగా సాగిపోతూనే ఉంది. సామాన్యులు పైసా, పైసా కూడగట్టుకుని సంపాదిం చుకున్న భూములు, ఇళ్ల స్థలాలు, డికెటి స్థలాలనే తేడా లేకుండా యథేచ్ఛగా కబ్జాలకు గురవుతుండడం పరిపాటిగా మారింది. తాజాగా జిల్లాలోని బ్రహ్మంగారిమఠం మండల పరిధిలో సుమారు ఆరు వేల ఎకరాలకుపైగా అక్రమార్కులు దొంగపట్టాల దగ్గర నుంచి పాసు పుస్తకాలు, వన్‌బి, సర్వే నెంబర్ల ఆన్‌లైన్ చేసుకున్నారు. భూ అక్రమార్కుల వెనుక దాగి ఉన్న రెవెన్యూ అధికారులు ఎవరు, ఏ మేరకు వారి పాత్ర ఉందనే వాస్తవాల్ని నిగ్గుదేల్చాల్సి ఉంది. అక్రమార్కులతో కలిసిన రెవెన్యూ అధికారులపై కఠినచర్యలు తీసుకుంటేనే అక్రమాలకు బ్రేకులు వేయడం సాధ్యమవుతుంది. కఠిన చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కించడం వల్ల రెవెన్యూ అధికారులతోపాటు అక్రమార్కుల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. వైసిపి హయాంలో బద్వేల్ పట్టణంలో భూకబ్జాలకు పాల్పడిన 16 మంది అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం బ్రహ్మంగారిమఠంలో ఆరు వేల ఎకరాలకుపైగా అక్రమార్కులు కాజేశారు. వైసిపి అధికారంలో ఉండగా టిడిపి కేడర్ అక్రమాలు వెలుగు చూడడం, టిడిపి అధికారంలో ఉండగా వైసిపి కేడర్ అక్రమాలు వెలుగులోకి రావడం పరిపాటిగా మారింది. ద్వంద్వ ప్రమాణాల కారణంగా భూకబ్జాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యం కావడం లేదనే సంగతిని గ్రహించాలి. జిల్లాలోని ప్రొద్దుటూరు కేంద్రంగా సాగుతున్న ఆన్‌లైన్ పలువురు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ముదావహం. రాజకీయ రంగు పులుమడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. బెట్టింగ్ కారణంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్న నేపథ్యంలో జాడ్యాన్ని రాజకీయాలకు ఆపాదిం చుకోవడం జుగుప్సాకరం. టి20, వన్‌డే, ఐపిఎల్, టెస్టు మ్యాచ్‌లకు సైతం బెట్టింగ్ కాయడం ఆందోళనకరం. సమాజ విచ్ఛిన్న ధోరణులను సీరియస్‌గా నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పొచ్చు. చివరగా అంతర్జాతీయ మహిళా క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా ప్రపంచకప్ గెలవడం అభినందనీయం. ప్రపంచకప్ క్రికెట్‌లో జిల్లాకు చెందిన శ్రీచరణి ఉత్తమ ప్రదర్శన గర్వించదగిన పరిణామం. విజయోత్సవ సంబరాల వేళ శ్రీచరణిని ఘనంగా సత్కరించడం శుభపరిణామం. శ్రీచరణిని ఆదర్శంగా తీసుకుని పలువురు రాణించడానికి అవకాశాలు ఉన్నాయని గ్రహించాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

క్రీడలు క్రమశిక్షణ, పట్టుదలను పెంచుతాయి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదలను పెంచుతాయని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ క్రీడా ప్రాంగణంలో 35వ సబ్ జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ ఛాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ క్రీడాకారులతో మాట్లాడి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసికస్థైర్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. క్రీడలు యువతను సానుకూల దిశగా నడిపిస్తాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి యువకుడు క్రీడల్లో భాగస్వామ్యం కావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మొత్తం 52 జట్లు పాల్గొనడం విశేషం. పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, కడప జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు గురుశేఖర్, టిడిపి పార్లమెంట్ కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, తాళ్లపల్లె వెంకటేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.



కేక్ పంచిపెడుతున్న టిడిపి నాయకులు

ఘనంగా రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం వేంపల్లెలలో టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. గండి రోడ్డులో టిడిపి యూత్ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. రేవంత్‌రెడ్డి టిడిపి జడ్పీటీసీ నుండి ఎమ్మెల్యేగా, కాంగ్రెస్ పార్టీలో ఎంపీగా గెలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా ఎదిగారన్నారు. టిఎన్ఎస్ఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు యాసిన్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, గండి మాజీ చైర్మన్ వండ్లకుంట రాజా రావు, టిడిపి మండల కార్యదర్శి తక్కెల షరీఫ్, మాజీ డైరెక్టర్ దొంతు సుబ్బా రావు, భాస్కర్, మహబూబ్ షరీఫ్, అహమ్మద్ అలీ (సెట్), గౌస్, కార్యకర్తలు పాల్గొన్నారు.



తవ్వారుపల్లె పాఠశాలలో నరికిన చెట్ల కొమ్మలు

అనుమతి లేకుండా పాఠశాలలో చెట్లు నరికివేత

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి అంటూ పదేపదే చెబుతున్న అధికారులు అక్రమంగా చెట్లు నరికివేత జరుగుతున్నా పట్టించుకోవట్లేదు. వివరాల్లోకెళ్తే.. మండలంలోని తవ్వారుపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం కొందరు వ్యక్తులు అక్రమంగా చెట్లు నరికి, వాటి కొమ్మలను అమ్మకానికి ప్రయత్నించారు. ఎండిన కొమ్మల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటాయనే కారణం చూపి అక్రమంగా కొమ్మలు నరికి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నించ సాగారు. ఈ విషయాన్ని కొందరు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాము ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యావరణానికి పాటు పడాల్సిన అధికారులు ఇలా చూసీచూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రజలు తీవ్రంగా ఆరోపణలు చేస్తున్నారు. చెట్ల నరికివేత ఎవరి అండదండలతో జరిగాయో విచారించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు, గ్రామస్తులు కోరుతున్నారు

ఒకే ఈతలో రెండు దూడలు



ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : ఒకే ఈతలో రెండు దూడలు జన్మించిన ఘటన మైదుకూరులోని కడప రోడ్డు శ్రీనివాస నగర్‌లో చోటు చేసుకుంది. పాడి రైతు శగినేని ఉదయ్ కిరణ్‌కు చెందిన గేదె ఒకే ఈతలో రెండు దూడలు జన్మించాయి. విషయం తెలుసుకున్న పశుసంవర్ధక శాఖ అధికారులు వెళ్లి పరిశీలించారు. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతాయని తెలిపారు. ప్రస్తుతం రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్య అధికారులు తెలిపారు. దూడలు చూసేందుకు స్థానికులు రైతు ఇంటికి భారీగా వచ్చారు. రైతు ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ఈ గేదెను ఇటీవల కొనుగోలు చేశానని, ఒకే ఈతలో రెండు దూడలు పుట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



మార్కెట్లో కూరగాయ ధరలు భగ్గు మంటున్నాయి. ఏం కొనేలా లేదు.. ఏం తినేలా లేదు. కొండెక్కిన కూరగాయ ధరలు, చుక్కలు చూపి స్తున్న నిత్యవసర ధరలు, మాంసం ధరలు.. సామాన్యుడి జీవనం భారంగా మారింది. రోజురోజుకూ ధరలు పెరిగిపోతున్నాయి. ధరలను నియం త్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూర గాయల మార్కెట్ ఒక ట్రెండు కూరగాయలు తప్ప.. మిగతావన్నీ కిలో రూ.80పైనే. టమాట, ఉల్లిగడ్డలు మాత్రమే కిలో రూ.30లోపు ఉన్నాయి. గత రెండు వారాలు నుంచి కిలో బెండకాయ రూ.60 నుంచి రూ.110, దొండకాయ రూ.60 నుంచి రూ.90, చిక్కుడు రూ.60 నుంచి రూ.100, బీరకాయ రూ.50 నుంచి రూ.80 క్యారెట్ రూ.50 నుంచి రూ.100, వంకాయలు రూ.40 నుంచి రూ.60, ఆలుగడ్డ రూ .40 నుంచి రూ.80, క్యాప్సికం రూ.40 నుంచి రూ.70, కాకర రూ.60 నుంచి రూ.80, పైనే ధరలున్నాయి. మెంతి ఆకు కట్ట రూ.10, కొత్తిమీర కట్ట రూ.30 నుంచి రూ.60కు చేరాయి. కూరగాయల ఇలా రేట్లు పెరగడంతో జనం అల్లాడుతున్నారు. మాంసం, నాటుకోడి ధర కిలో రూ.800 ఉంది. కోడిగ్రుడ్డు రూ.8. డజన్ గ్రుడ్లు రూ.70 అమ్ముతున్నారు. దళారులు రైతుల నుంచి తక్కువతో తీసుకుని మార్కెట్లో ఎక్కువ రేట్లు అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి. రైతులకు, ప్రజలకు భారమవుతున్నాయే తప్ప ఎవరికి ఎలాంటి ప్రయోజనం లేదు. దళారులు మాత్రం లాభాలు ఆర్జిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని రైతు బజార్‌లను ప్రారంభించాలని పలువురు సూచిస్తున్నారు. వీటివల్ల అటు రైతులకు, ఇటు ప్రజలకు మేలు జరిగేలా చూడాలని కోరుతున్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాలి.

జీతం సరిపోవడం లేదు

కూరగాయలు, నిత్యవసర సరుకులు, మాంసం ధరలు పెరగడంతో వచ్చే జీతం సరిపోవడంలేదు. చిన్న ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. నెలకు రూ.12 వేలు జీతం వస్తే సరుకులకే సరిపోతుంది. ఇతర ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తోంది.

- గోపాల్‌రెడ్డి, చిరుద్యోగి, పులివెందుల

రూ.500కు కూడా సరిపడ రావడం లేదు

కూరగాయ ధరలు విపరీతంగా పెరిగాయి. మార్కెట్‌కుపోతే రూ.500 ఖర్చు చేసినా వారానికి సరిపడ రావడం లేదు. నిత్యవసర ధరలు పెరగడం.. వర్షాకాలం కావడంతో కూలి పనులు కూడా లేవు. జీవనం సాగించడం కష్టంగా ఉంది. **- భవాని, వ్యవసాయ కూలీ, పులివెందుల**

పచ్చళ్లతో సర్దుకుపోతున్నాం

ధరలు పెరగడంతో కూరగాయలు కొనలేక పచ్చళ్లతో సర్దుకుపోవాల్సి వస్తోంది. వచ్చే ఆదాయంలో నిత్యవసర వస్తువులు కొనే పరిస్థితి లేదు. బతకడానికి కావాల్సిన వస్తువులు మాత్రమే మార్కెట్ నుంచి తెచ్చుకుంటున్నాం. **- ఉమాదేవి, గృహిణి, పులివెందుల**

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సిబిఐటి విద్యాసంస్థల చైర్మన్ జయచంద్రారెడ్డి సూచించారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముద్రించిన సే నో టు డ్రగ్స్ పోస్టర్‌ను శనివారం సిబిఐటి ఇంజినీరింగ్ కాలేజీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ యువత తమ విలువైన భవిష్యత్‌ను తెలిసీతెలియని వయసులో డ్రగ్స్‌కు అలవాటు పడి నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ మహమ్మారికి యువత దూరంగా ఉండాలన్నారు. నేటి యువత సమాజంలో వివిధ రూపాల ప్రభావంతో ఆకర్షితులవుతున్నారన్నారు. స్టైల్, సరదా కోసం మత్తుపదార్థాలకు, డ్రగ్స్‌కు లోనవుతున్నారన్నారు. అందులో నుండి బయటపడలేక తమ బంగారు భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ మాట్లాడుతూ యువజన సంఘం ఉద్యమాలే కాక, యువతను చైతన్య చేసేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతుందన్నారు. దేశ భవిష్యత్ యువతే అన్నారు. యువత ప్రపంచ దేశాల్లో కంటే భారత దేశంలోనే ఎక్కువన్నారు. కార్యక్రమంలో సిబిఐటి విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాసులు, ఐడిపిఎస్ ప్రిన్సిపల్ రవీంద్ర, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు విశ్వనాథ్, రవితేజ పాల్గొన్నారు.



పోస్టర్ల ఆవిష్కరణలో కళాశాల యాజమాన్యం, డివైఎఫ్ఐ నాయకులు

ఇష్టానుసారంగా ఓపెన్ ఎడ్యుకేషన్ అడ్మిషన్లు



మాట్లాడుతున్న వినయ్‌కుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగులో విచ్చలవిడిగా ఓపెన్ ఎడ్యుకేషన్ విద్యా సంస్థలు ఎలాంటి పర్మిషన్ లేకుండా అడ్మిషన్ల చేసుకొని విద్యను వ్యాపారం చేస్తున్నారని పట్టణ సిఐటియు ఉపాధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నిరాక్షరాస్యత, ఫెయిల్ అయిన విద్యార్థులు పనులు చేసుకుంటూ ఒకే సంవత్సరంలోనే వారి కోర్సు అయిపోతుందనే ఆలోచనతో ఓపెన్ ఎడ్యుకేషనల్‌పై ఆధారపడుతున్నారన్నారు. ఎంతోమంది సర్టిఫికెట్ల కోసం ఓపెన్ ఎడ్యుకేషన్ విద్యను ఎంచుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణంలో పర్మిషన్, ఆఫీసు, స్కూల్ అథారిటీ లేకుండా అడ్మిషన్ల రూపంలో దోచుకుంటున్న వ్యక్తులు చాలా వరకు ఉన్నారన్నారు. రూ.8,000 నుంచి రూ.16వేల వరకు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకే సంవత్సరంలోనే మీ కోర్స్ పూర్తవుతుందని, మీరు రాకపోయినా ఇంకో వ్యక్తి ద్వారా కూడా పరీక్షలు రాయిస్తామని ధీమా ఇస్తున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తనిఖీ చేయాలని ఆయన కోరారు. తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాషా, పాములేటి పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే మంచి సమాజం : డిఇఒ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాజ్యాంగం మేరకు నియమ నిబంధనలు కచ్చితంగా పాటించినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని డిఇఒ శంషుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక జార్జ్ కోర్నేషన్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని డిఇఒ ప్రారంభించి, ప్రసంగించారు. రాజ్యాంగం మేరకు నిర్మితమైన శాసన నిర్మాణశాఖ గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అవగాహన కోసమే ఈ కార్యక్రమాన్ని ఇస్తున్నామన్నారు. జిల్లా విద్యాశాఖ ఉప అధికారి రాజగోపాల్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖ అధికారి మీనాక్షి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ప్రతి నియోజకవర్గం నుండి ఒక విద్యార్థిని ఎంపిక చేసేందుకు ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 26న అమరావతిలో జరిగే రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా నిర్వహించే స్టూడెంట్ అసెంబ్లీ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రతినిధిగా పాల్గొంటారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం నుండి ఎస్ అసిఫా, పులివెందుల నియోజకవర్గం నుండి సలోని, కడప నుండి పి రాజేశ్వరి, మైదుకూరు నుండి పి వీర ఉదయశ్రీ, కమలాపురం నుండి వి తేజ నరసింహచారి, జమ్మలమడుగు నుండి ఎం సంగీత, బద్వేల్ నుండి కె యోగవర్షిత ఎంపికైనట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్ రాజగోపాల్‌రెడ్డి, చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎంఇఒలు శోభారాణి, సావిత్రమ్మ, మైలవరం ఎంఇఒ చిట్టిబాబు, నేతాజీ సోషల్ క్లబ్ కన్వీనర్ భాస్కర్‌రావు, గురుకుమార్, షాబుద్దీన్, వెంకటరాజు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ శంషుద్దీన్

స్ట్రాటో ఎక్స్-2025 శాటిలైట్ ఆవిష్కరణ



ఎగురుతున్న విద్యార్థులు రూపొందించిన శాటిలైట్

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక సిబిఐటి ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం 35 మంది విద్యార్థులు రూపొందించిన స్ట్రా ఎక్స్-2025 సమీప అంతరిక్ష అన్వేషణ మిషన్ శాటిలైట్‌ను ఏరో లాంచ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఆకాశంలోకి పంపారు. 35 మంది విద్యార్థులు 7 బృందాలుగా విడిపోయి ఒక్కో బృందం ఒక్కో సెన్సార్‌ని డిజైన్ చేసి ప్రాజెక్టులో పాల్గొన్నారు. శాటిలైట్‌ను హై ఆల్టిట్యూడ్ బెలూన్ ద్వారా నిర్దేశించిన 25 కిలో మీటర్ల ఎత్తు వరకు వెళ్లి వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేస్తుంది. 900 గ్రాముల బరువు కలిగిన పీకో శాటిలైట్ పేలోడ్‌లో ఉష్ణోగ్రత, పీడనం, ఆర్ద్రత, యువి కిరణాలు, జిపిఎస్ స్థానం వంటి వాటిని గుర్తిం చడం, కొలవడం, వాతావరణంలో కలిగే మార్పులను ఈ శాటిలైట్ తెలియజేస్తుందని విద్యార్థులు వివరించారు. 900 గ్రాముల బరువు కలిగిన ఈ శాటిలైట్‌లో సెన్సర్లు, హై రిజల్యూషన్ కెమెరాలు అమర్చడం వలన పారామీటర్లను కొలవడంతోపాటు, వాతావరణ పరిశోధన, అంతరిక్ష వ్యవస్థల రూపకల్పన, డేటా విశ్లేషణలో ప్రత్యక్ష అనుభవాన్ని పొంది, ఆ పరిస్థితుల్లో ఉత్పన్నమయ్యే సమస్యలకు తగు పరిష్కా రాలు ఇచ్చేందుకు ఈ ప్రయోగం ఉపయోగ పడుతుందని తిరుపతికి చెందిన ఎన్ఎఆర్‌సిఎల్ సైంటిస్ట్ బసివి డాక్టర్ రాధాకృష్ణన్, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బిజయరామిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబిఐటి కళాశాల చైర్మన్ డాక్టర్ వి.జయ చంద్రారెడ్డి , సిఇఒ లోహిత్‌రెడ్డి, డైరెక్టర్ అకా డమిక్ ప్రసన్న వెంకటేష్, డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శృతి, సందీప్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానం..చక్రాయపేట రోడ్డు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండల కేంద్రమైన చక్రాయపేటలో రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. ఈ దారిన ప్రయాణించాలంటే పాదరాచులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రాయచోటి-వేంపల్లి జాతీయ రహదారి పనుల్లో కాంట్రాక్టర్ నిమగ్నమై ఈ దారిని మరిచిపోయారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చక్రాయపేట పట్టణంలో జాతీయ రహదారి వెళ్లకపోవడంతో దీన్ని గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. కొద్దిపాటి వర్షం పడినా గుంతలు పడుతున్నాయి. వాహనదారులు రోడ్డు ప్రమాదానికి గురికావాల్సిన పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకునేకంటే ముందుగా రోడ్డు గుంతలను పూడ్చా లని కోరుతున్నారు. బస్సులు చక్రాయపేట నుంచి వెళ్లాల్సి ఉన్నందున దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సి ఉంది.





పోలీసుస్టేషన్ ముందు ధర్నా చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, రైతులు

కేబుల్ వైర్ల దొంగలను అదుపు చేయాలి : ఎంపీ

ప్రజాశక్తి - లింగాల

కొన్ని రోజులుగా రైతుల పంట పొలాల్లో మోటరు కేబుల్స్ వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్షణం స్పందించి రైతులకు న్యాయం చేయాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పోలీసులను డిమాండ్ చేశారు. లింగాల పోలీస్‌స్టేషన్ ముందు బాధిత రైతులతో కలిసి శనివారం ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పలు చోట్ల రైతుల కేబుల్ వరుసగా చోరీకి గురవుతున్నాయన్నారు. శుక్రవారం రాత్రి కోమన్నూతలలో 40 మంది రైతుల కేబుల్ చోరీ చేశారన్నారు. అరటి రైతు పురుషోత్తం పొలంలో వెయ్యి మీటర్లు వ్యవసాయ కేబుల్ దొంగతనం జరిగిందన్నారు. ఆ రైతుకు రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని ఎంపీ పేర్కొన్నారు. పోలీసులు తక్షణమే స్పందించి రైతులకు వారి కేబుల్‌ను రికవరీ చేయాలని కోరారు. కేబుల్ దొంగతనాలు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘ టనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విష యాన్ని ఎస్‌పి దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బాబురెడ్డి, లింగాల మాజీ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు



దీక్ష చేస్తున్న చైర్‌పర్సన్, మహిళలు

దీక్షలో మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపల్ ఎగ్జిబిషన్‌కు సంబంధించి టిడిపికి చెందిన గుత్తేదారుడు సుమారు రూ.కోటి ఎగవేసిన నేపథ్యంలో.. ఆ డబ్బును మున్సిపల్ ఖజానాకు చెల్లించే వరకు వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి కూర్చున్నారు. సంఘీభావంగా ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ, వైసిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు దానమ్మ, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు కందుల వాసంతి, రాజుపాలెం మండల మహిళా అధ్యక్షురాలు కానాల విజయలక్ష్మి, ప్రొద్దుటూరు పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు రాజారాంరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి సంగీత ఎంపిక

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ముద్దనూరు రోడ్డులోని జడ్పిహెచ్ స్కూల్ విద్యార్థిని ఎం.సంగీత మాక్ అసెంబ్లీ శాసన సభ్యురాలిగా ఎంపికైనట్లు ఎంఇఒ-2, హెచ్ఎం రామాంజనేయుల రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలోని జార్జిక్లబ్లో శనివారం మాక్ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ఎన్నిక జరిగిందన్నారు. మండలస్థాయిలో వ్యాస రచన, ఉపన్యాసం, క్విజ్ పోటీల ద్వారా ముగ్గురు విద్యార్థులను ఎన్నుకున్నారని, నియోజకవర్గస్థాయిలో పోటీలు నిర్వహించి ఒకొక్కరిని ఎన్నుకున్నారని తెలిపారు. అలా ఎన్నుకోబడిన విద్యార్థులు నియోజకవర్గానికి ఒకరు రాష్ట్రస్థాయి అసెంబ్లీలో పాల్గొంటారని తెలిపారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై అవగాహన పెంచే ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందని వివరించారు. జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి పదవ తరగతి విద్యార్థిని సంగీత ఎన్నిక కావడం పట్ల తోటి విద్యార్థులు, ఎంఈఓ శివప్రసాద్, ఇన్‌ఛార్జి హెచ్ఎం భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు సునీత, చంద్రఓబుల రెడ్డి హర్షం వ్యక్తం చేసి అభినందించారు.



తేక్వాండో పోటీల్లో సంసిద్ధ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

తేక్వాండో పోటీల్లో సంసిద్ధ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ పరిమళాదేవి తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలో జరిగిన జిల్లాస్థాయి తేక్వాండో పోటీల్లో 32 పాఠశాలల నుండి 226 మంది హాజరు కాగా, వేంపల్లె సంసిద్ధ్ సతీష్‌రెడ్డి పాఠశాల నుండి 39 మంది హాజరయ్యారన్నారు. వీరిలో 14 మంది విద్యార్థులు పతకాలు సాధించారని చెప్పారు. ఇందులో 8 మంది రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యారని వివరించారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పరిమళాదేవి హర్షం వ్యక్తం చేశారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

క్రైం కార్నర్

పోలీసులపై కేసు నమోదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

తనను బెదిరించారని రిటైర్డ్ ఎఎస్‌పి రాజేశ్వర్‌రెడ్డి, రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న రామకృష్ణారెడ్డిపై కుళ్లాయప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ వివరాల మేరకు.. గత నెలలో లింగాల మండలానికి చెందిన కుళ్లాయప్ప అనే వ్యక్తిని జమ్మలమడుగు దగ్గర వారు కుళాయప్పను బెదిరించారని కర్నూల్ తాలూకా కోర్టులో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. శుక్రవారం ఈ కేసు పులివెందులకు బదిలీ చేయడంతో ఐపీసీ 341, 506 సెక్షన్‌ల కింద ఎఫ్‌వైఆర్ నెంబర్ 571/2025 నమోదు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం విచారిస్తామన్నారు.